క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా కరుణాకర్



విద్యారణ్యపురి: ఎస్‌జీఎఫ్ హనుమకొండ మండల సెక్రటరీగా సుబేదారి ప్రభుత్వ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం.కరుణాకర్ ఎన్నికయ్యారు. పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా కరుణాకర్‌ను ఎన్నుకున్నట్లు మండల విద్యాశాధికారి నెహ్రూనాయక్ తెలిపారు. సమావేశంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, మల్లారెడ్డి, రాణి, వెంకటేశ్వర్లు, మనోహర్, సరళ, శోభ, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. జకోటియా కాంప్లెక్స్, వాసవీ కాలనీ, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, చోటీ మసీదు, సుబేదారి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కిషన్‌పుర మెయిన్ రోడ్డు, కేయూసీ కూడలి ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పద్మశాలి సంఘాల సమావేశం

మడికొండ: హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలో ఆదివారం జరగనున్న హనుమకొండ జిల్లా పద్మశాలి పరపతి సంఘాల సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు మడికొండలోని పద్మశాలి సంఘం భవనంలో వాల్‌పోస్టర్లు, కరపత్రాలను శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో వైద్యం రాజగోపాల్, కామని మల్లేశం, పోతరాజు ప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ దంత వైద్యులతో జాగ్రత్త



నయీంనగర్: గుర్తింపులేని దంత వైద్యులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.మనోరంజన్ రెడ్డి, వరంగల్ సెక్రటరీ డాక్టర్ వేణుయాదవ్ సూచించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వేణు మాట్లాడుతూ నేషనల్ దంత వైద్య గుర్తింపు లేని, స్పెషాలిటీ పూర్తి కాని డాక్టర్ జి.శేషుకుమార్ జీఎల్ఎస్ డెంటల్ క్లినిక్ నిర్వహిస్తున్నారని అన్నారు. నకిలీ వైద్యుల ఆకర్షణీయమైన ప్రకటనలకు మోసపోవద్దని తెలిపారు. అర్హత లేని వైద్యులు నాణ్యత లేని మెటీరియల్స్‌తో నకిలీ ఇంప్లాంట్స్ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి, డాక్టర్ జితేందర్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నీటిలోనే రాతికోట ఉత్తర ద్వారం



ఖిలా వరంగల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాకతీయుల రాజధాని ఖిలా వరంగల్ రాతి కోట ఉత్తర ద్వారం నీటిలో మునిగింది. వర్షం వీడినా ఉత్తర ద్వారం ఇంకా నీటిలోనే ఉంది. దాంతో రాకపోకలు నిలిచిపోయాయి. పర్యాటకులు ఉత్తర ద్వారం వీక్షించే అవకాశం లేదు. ఫస్సడ్ లైట్లు సైతం నీటిలో మునిగిపోయాయి. రాతి కోట ద్వారానికి వేలాడుతున్న పిచ్చిమొక్కలను కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది శనివారం తొలగించారు.

శరీర దానానికి అంగీకారం

విద్యారణ్యపురి: కాజీపేట మండలం భట్టుపల్లి నివాసి, విద్యా ఫౌండేషన్ సభ్యురాలు, కవయిత్రి సొన్నాయిల కృష్ణవేణి, ఆమె కుమారుడు మణితేజ అవయవ, శరీర దానానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు అంగీకార పత్రాలపై వారు సంతకాలు చేశారు.

వెంకటేశ్వర్లుకు బీవీపీ అవార్డు

విద్యారణ్యపురి: భారత వికాస్ పరిషత్ (బీవీపీ) అవార్డును నాగార్జున హైస్కూల్ కరస్పాండెంట్ ఆడెపు వెంకటేశ్వర్లు అందుకున్నారు. విద్యారంగం, ఆధ్యాత్మిక విభాగంలో ఆయన అందిస్తున్న సేవలకుగాను ఆయనకు పురస్కారాన్ని కేశవ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సుబ్రమణ్యం, బీవీపీ ప్రాంత అధ్యక్షుడు నాగేశ్వర్ గుప్తా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ అందజేశారు.

గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్: గంజాయి విక్రయానికి పాల్పడుతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసి అతని నుంచి 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు రూ.700 నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లి గ్రామానికి చెందిన మేరిజల రోహిత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ వివరించారు.

తపాలా సేవలకు మంగళం

- ఆందోళన వ్యక్తం చేస్తున్న డీజిల్‌కాలనీలోని ఖాతాదారులు
- కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారి డీజిల్ కాలనీ ప్రాంతంలో ఉన్న ఉప తపాలా కార్యాలయాన్ని జిల్లా అధికారులు ఎత్తివేయడంతో ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా పట్టణ ప్రజలకు విశేష సేవలు అందించిన పోస్టాఫీస్‌ను కాజీపేట పోస్టాఫీసులో అధికారులు ఇటీవల విలీనం చేశారు. ఇక్కడ ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందిని నగరంలోని సంబంధిత కార్యాలయాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. గత నెలలో హైదరాబాద్ నుంచి తనిఖీ నిమిత్తం వచ్చిన పీఎంజీ స్థాయి అధికారి.. డీజిల్ కాలనీలోని పోస్టాఫీస్‌కు కాజీపేటలోని పోస్టాఫీస్ మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉన్న నేపథ్యంలో ఇక్కడ బ్రాంచ్



మూసివేసిన తపాలా కార్యాలయం

ఆఫీసు ఎందుకు అని ప్రశ్నించడంతో పాటు వెంటనే విలీనానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ సమయంలో ఉన్న ఖాతాదారులు వ్యతిరేకించినప్పటికీ అనంతరం మిన్నకుండిపోయారు.

తాళం తీయని అధికారులు

ఇటీవల పోస్టాఫీస్ తాళాన్ని సిబ్బంది తీయకపోవడంతో ఖాతాదారులు ఏం జరిగిందోనని చర్చించుకుంటున్నారు. ఈ ఉప తపాలా కార్యాలయం పరిధిలో రైల్వే డీజిల్‌షెడ్, ఎలక్ట్రికల్ షెడ్ ఉద్యోగులతో పాటు పెన్షనర్లు, చిరు వ్యాపారులు 4వేల మందికిపైగా ఖాతాలను కలిగి ఉన్నారు. నెలకు రూ.కోటి, రూ.కోటిన్నరకు పైగా లావాదేవీలు జరుగుతుంటాయి. అలాంటి ఉప తపాలా కార్యాలయాన్ని అధికారులు చెప్పపెట్టకుండా ఎత్తివేయడంతో ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుబాటులో ఉన్న తపాలా కార్యాలయాన్ని ఆకస్మికంగా మూసివేయడంతో ఖాతాదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోస్టల్ అధికారులు మాత్రం పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే సేవలు నిలిపివేసినట్లు చెబుతున్నారు. అధికారులు ఖాతాదారుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని వారం రోజుల్లోగా తపాలా కార్యాలయాన్ని తెరవకుంటే ఆందోళన నిర్వహిస్తామని, అందుకు కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



మడికొండ: అంగన్‌వాడీలో వారోత్సవాలు

విద్యారణ్యపురి: ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరమని హనుమకొండ ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి అన్నారు. జాతీయ పోషణ వారోత్సవాల్లో భాగంగా న్యూట్రిషన్ విభాగం అధిపతి డాక్టర్ లకన్‌సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు శనివారం వివిధ రకాల పౌష్టికాహార వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంక్ ఫుడ్‌కు ఆకర్షితులు కాకుండా పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, అధ్యాపకులు సురేష్‌బాబు, అరుణ, సుభాషిణి, కల్పన, సంతోషి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో..

మడికొండ: 46వ డివిజన్ రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ శారద మాట్లాడుతూ పిల్లలకు చిన్నప్పటి నుంచే పోషకాహారం అందించాలని సూచించారు. తల్లుల కమిటీ అధ్యక్షురాలు సరిత పాల్గొన్నారు.

9న లంబాడీల ఆత్మగౌరవ మార్చ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో లంబాడీలు ఎస్టీలు కాదని, దొడ్డిదారిన రిజర్వేషన్లు అనుభవిస్తున్నారన్న అసత్య ఆరోపణలను నిరసిస్తూ ఈనెల 9న హనుమకొండలో నిర్వహించనున్న లంబాడీల ఆత్మగౌరవ మార్చ్‌ను విజయవంతం చేయాలని లంబాడీ రిజర్వేషన్ల జేఏసీ రాష్ట్ర సమన్వయ కర్తలు గుగులోతు రాజునాయక్, వినోద్ లోక్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో శనివారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సమన్వయకర్తలు డాక్టర్ చందునాయక్, లకావత్ రవీందర్ నాయక్, అజ్మీరా శ్రీరామ్‌నాయక్, కేలోతు భిక్షపతి, భూక్య రాజు, వాలు నాయక్, మురళి నాయక్, మోహన్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ బాధ్యులు భూక్య రమేష్, తిరుపతి, అశోక్, ఆలోజి నాయక్, సునీల్, అఖిల్, చందులాల్ తదితరులు పాల్గొన్నారు.

నయీంనగర్: లంబాడీలపై రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు తమ వైఖరి స్పష్టం చేయాలని కోరుతూ ఈనెల 9న చలో వరంగల్ శాంతియాత్ర నిర్వహిస్తున్నట్లు తెలంగాణ లంబాడీ జేఏసీ నాయకుడు జైసింగ్ రాథోడ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కిషన్ నాయక్, వెంకన్న నాయక్, జవహర్‌లాల్, వీరన్న నాయక్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

నేడు 'మెట్టుగుట్ట' మూసివేత

మడికొండ: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి మెట్టుగుట్టపై ఉన్న శివాలయం, రామాలయాలను మూసివేయనున్నట్లు కార్యనిర్వాహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం 9గంటలకు దేవాలయాల శుద్ధి, చంద్రగ్రహణ సంప్రోక్షణ కార్యక్రమం అనంతరం భక్తులకు యథావిధిగా దర్శనాలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నట్లు వివరించారు.

'దళిత, బహుజనుల కోసం పోరాడుతున్న రమేష్ కుమార్'



రమేష్ కుమార్‌ను సన్మానిస్తున్న బండా ప్రకాశ్

హన్మకొండ: ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు దళిత బహుజనుల హక్కులు, సమస్యల పరిష్కారం పోరాడుతున్న వ్యక్తి రౌతు రమేష్ కుమార్ అని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కొనియాడారు. హనుమకొండ నందీహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తూ పదవీ విరమణ పొందిన రమేష్ కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమార్, జడల రవి, కె.కృష్ణ, పులి రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీలో దేశానికే ఆదర్శం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: సన్నబియ్యం పంపిణీలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించి రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల హాజరు పట్టికను పరిశీలించారు. ఆ తర్వాత నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో గ్రామపంచాయతీ భవనంతో పాటు పీఏసీఎస్ భవనాన్ని కూడా నిర్మిస్తామని తెలిపారు. ఈ మేరకు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు తెలపగా, అధికారులతో



చిన్నారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ఎమ్మెల్యే మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు సాంబయ్య, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, నాయకులు మంద రాజు, రామంచ ప్రభాకర్, భవాని తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు క్రీడలు



మొక్క నాటి నీరు పోస్తున్న రవికుమార్

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులకు శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. పోటీలను ఎస్ఐటీ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ ప్రారంభించి స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చేస్తూనే క్రీడలపై మక్కువతో పోటీల్లో ఉద్యోగులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ మాట్లాడుతూ ప్రొఫెసర్ రవికుమార్ అనేక మందిని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, అఫ్జల్, రాజు, రమేష్, శంకర్, ప్రభుదాస్, సిబ్బంది శ్రీనివాస్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణతో తగ్గనున్న భారం



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి

హన్మకొండ: జీఎస్టీ సవరణతో ప్రజలపై భారం తగ్గనుందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గించిన సందర్భంగా హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంతోష్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి కానుకగా తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలు ఈనెల 22 నుంచి అమలులోకి వస్తాయన్నారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలోనే 3వ స్థానానికి చేరుకుంటుందని చెప్పారు. ప్రజలు స్వదేశీ వస్తువుల వినియోగంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, డాక్టర్ విజయ్ చందర్‌రెడ్డి, నాను నాయక్, నర్మెట శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, శ్రీరామ్ రెడ్డి, రత్నలక్ష్మి, సంద్ర మధు, మునగాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శం

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జీవితం ప్రపంచంలోని సమస్త మానవాళికి ఆదర్శమని జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం వరంగల్ జిల్లా అధ్యక్షురాలు సయ్యదా హుమెరా, జనగామ జిల్లా అధ్యక్షురాలు అతియా సుల్తానా అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా కాజీపేట, సుబేదారి జమాతే ఇస్లామీ హింద్ మహిళా యూనిట్ల ఆధ్వర్యంలో సీరత్ జల్సా కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రవక్త జీవితం సందేశాలు, ఆదర్శాలపై ప్రసంగించారు.

మైనార్టీ గురుకులంలో మిలాద్ ఉన్ నబీ

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ రంగశాయిపేట శివారు జక్కలొద్ది మైనార్టీ గురుకులంలో జల్సే మిలాద్ ఉన్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాన వక్తలు

నబీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఫ్తీ మినాజ్, మౌలానా ఖలీద్ సయిద్, ఆరీఫొద్దీన్ ప్రధాన వక్తలు పాల్గొని మహ్మద్ ప్రవక్త సందేశాలను విద్యార్థులకు వివరించారు. ప్రవక్త ప్రపంచ మానవాళికి మార్గదర్శనం చేశారని కొనియాడారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ అబ్దుల్లా, కౌన్సిలర్ సర్వర్ మోహియొద్దీన్ ఘాజీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాలికపై లైంగిక దాడి..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెంబర్తిలో శనివారం ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన బబ్లూ అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఈ ఘటన జరిగినప్పుడు బాలిక తల్లిదండ్రులు ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లినట్లుగా స్థానికులు చెబుతున్నారు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన బాలిక విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సదరు యువకుడు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది.

చీఫ్ విజిలెన్స్ అధికారికి శుభాకాంక్షలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చీఫ్ విజిలెన్స్ అధికారిగా బోనాల కిషన్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శనివారం కలిసి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్క దానయ్య, ఎన్పీడీసీఎల్ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్, నాయకులు కృష్ణ, జడల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి ప్రాణాలు కాపాడిన పోలీసులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు రంగసముద్ర వద్ద శనివారం రెండోరోజు వినాయక నిమజ్జనం కార్యక్రమం కొనసాగుగింది. ఈ క్రమంలో ట్రాక్టర్‌లో కూర్చొని వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఓ భక్తుడికి ఆకస్మాత్తుగా ఫీట్స్ వచ్చి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అది గమనించిన మిల్స్ కాలనీ ఎస్సై శ్రవణ్, కానిస్టేబుల్ చందు వెంటనే అప్రమత్తమై ఆ యువకుడిని పక్కకు తీసుకెళ్లి వైద్య సిబ్బంది సహకారంతో ప్రథమ చికిత్స అందించారు. యువకుడి ప్రాణాలను కాపాడిన పోలీసులను పలువురు అభినందించారు.

పోటాపోటీగా లడ్డూ వేలం



ఖిలా వరంగల్: గణనాథుల నిమజ్జనం నేపథ్యంలో శనివారం సాయంత్రం వినాయక లడ్డూల వేలంపాటలు పోటాపోటీగా సాగాయి. మండల పరిధిలోని శివనగర్, రాక్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో, శ్రీవిద్యానగర్ వరసిద్ధి వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించిన వేలంపాటలో మేరుగు అశోక్ రూ.1,36,500లు, గుగిళ్ల నాగరాజు రూ.2,05,116కు లడ్డూలు దక్కించుకున్నారు.

శ్వేతార్క ఆలయంలో బ్రహ్మోత్సవాలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో 16 రోజులుగా సాగుతున్న గణపతి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. గణపతి దీక్షలు స్వీకరించి మండల (41) రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాల్లో నిమగ్నమైన మాలధారులు.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 108 కిలోల బియ్యంతో వండిన అన్నంతో శ్వేతార్కుడికి అభిషేకం నిర్వహించారు.

యూనివర్సిటీ లా కళాశాలలో హరితహారం

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ లా కళాశాలలో విద్యార్థులతో కలిసి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ శనివారం పలు మొక్కలు నాటారు. తొలుత ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుదర్శన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాతంగి రమేష్‌బాబు, చల్లా శ్రీనివాస్, హరిప్రసాద్, మధు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఫెడరేషన్ బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించాలి

కాజీపేట రూరల్: కాజీపేటలో ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్స్ ఫెడరేషన్ బ్రాంచ్ ఎన్నికలు నిర్వహించాలని రైల్వే రిటైర్డ్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ గార్డు, ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకుడు పెసరు భాస్కర్‌రావు ఒక ప్రకటనలో కోరారు. కాజీపేట బ్రాంచ్ కార్యవర్గ కాలం 2024, డిసెంబర్ నాటికి పూర్తి అయినప్పటికీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించకుండా, కోర్టు కేసు సాకుతో 15 వందల మంది సభ్యులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

జీతాలు చెల్లించాలి

న్యూశాయంపేట: మైనార్టీ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలల జీతాలు చెల్లించాలని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు కోరారు. ఈ మేరకు కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా టెమ్రిస్ సెక్రటరీకి శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుల్తాన్, హమీద్, బీఎస్.స్వామి, ఎండీ.ఆసిఫ్, ఫిరోజ్, షాహెదా, భాగ్య, సిద్దన్న, లలిత, మాధవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

హసన్‌పర్తి: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాల ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలోని నోటీసు బోర్డుపై శనివారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవి, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం పరిశీలన

వరంగల్ అర్బన్: వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువులో రెండో రోజు శనివారం వినాయక నిమజ్జన సరళిని నగర మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. నిమజ్జనం అయిపోయేవరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఆదేశించారు.

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

నయీంనగర్: సోమవారం తలపెట్టిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ముట్టడికి మాల కులస్తులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, తరలి రావాలని మాల మహానాడు వరంగల్ పశ్చిమ ఇన్‌చార్జ్ పి.శ్రీనివాస్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో పిలుపునిచ్చారు.

విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కేయూ క్యాంపస్: వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్, కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లను శుక్రవారం అందజేసినట్లు కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బిక్షాలు, డాక్టర్ రమణ శనివారం తెలిపారు. పులి విజ్ఞ, సోమ శివాణి, అఖిల, శ్రావణి, అభిజ్ఞ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక కాగా, ఒక్కో విద్యార్థినికి రూ.10 వేల చొప్పున ఇన్నర్‌వీల్ క్లబ్ బాధ్యులు అందజేసినట్లు వివరించారు. క్లబ్ అధ్యక్షురాలు మత్రి రేణుక, సెక్రటరీ అర్చన, వ్యవస్థాపక సభ్యురాలు నేరెళ్ల శోభావతి, కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి పాల్గొని అందజేశారని తెలిపారు.

సమాజ సేవకులు పాత్రికేయులు

హసన్‌పర్తి: సమాజ సేవకులు పాత్రికేయులని వాకర్స్ అసోసియేషన్ -303 డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్ అన్నారు. పాత్రికేయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విలేకరులను కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో పాత్రికేయుల సేవలు గొప్పవని కొనియాడారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలువురు పాత్రికేయులను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పాత్రికేయులు వ్యవహరిస్తారని అన్నారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్, క్లబ్ కోశాధికారి మాధవ్ శంకర్, డిస్ట్రిక్ట్ జాయింట్ సెక్రటరీ శంకర్, జోన్ చైర్మన్ సుధీర్, మాజీ అధ్యక్షుడు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నగర వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ అవార్డులు అందుకున్న వారిని అభినందించారు.

- సాక్షి నెట్‌వర్క్



హసన్‌పర్తి: అధ్యాపకులను సన్మానిస్తూ..



నక్కలగుట్టలోని ఎస్ఆర్ స్కూల్‌లో..



కాజీపేటలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కొనసాగిన నిమజ్జనం









వినాయక నిమజ్జనం గ్రేటర్ పరిధిలో రెండో రోజు శనివారం కూడా కొనసాగింది. శుక్రవారం రోజు సెంటిమెంట్‌తో చాలామంది వినాయక మండపాల నిర్వాహకులు రాత్రి 12 గంటల తరువాత విగ్రహాలను కదిలించి శోభాయాత్ర ప్రారంభించారు. మరికొంతమంది శనివారం విగ్రహాలను నిమజ్జనం చేశారు. దీంతో ఆయా విగ్రహాలు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరంగల్ చిన్నవడ్డేపల్లి చెరువుకు తరలివచ్చాయి. పోచమ్మమైదాన్‌నుంచి వడ్డేపల్లి చెరువు వరకు బారులుదీరాయి.

- ఖిలా వరంగల్ / సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్